టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ..

వీరుడి వీడ్కోలు

ఇంగ్లండ్ సిరీస్‌కు ముందే ప్రకటన • అభిమానులకు అనూహ్య షాక్

భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది! ఆటగాళ్ల సత్తాకు సవాల్ విసురుతూ వారిని నిత్యం పరీక్షించే టెస్టులలో బ్యాటర్‌గానే గాక కెప్టెన్‌గానూ తనకు తానే సాటి అని నిరూపించుకున్న టీమ్‌ఇండియా మాజీ సారథి విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. దశాబ్దంన్నర కాలంగా భారత క్రికెట్ బ్యాటింగ్‌కు చిరునామాగా మారి ఆధునిక క్రికెట్‌లో 'లెజెండ్'గా వెలుగొందుతున్న కోహ్లీ.. 'ఇక సెలవు' అని ప్రకటించాడు. భారత క్రికెట్‌ను ఎవరెస్టు శిఖరమంత ఎత్తున నిలిపిన ఈ పరుగుల యంత్రం విన్యాసాలు.. ఇక వన్డేలు, ఐపీఎల్‌ల్లో మాత్రమే కొనసాగనున్నాయి.

ఢిల్లీ: క్రికెట్‌లో అత్యుత్తమ ఫార్మాట్ అయిన టెస్టుల్లో తన నాయకత్వ ప్రతిభతో భారత క్రికెట్ జట్టును అత్యున్నత శిఖరాలకు చేర్చిన వీరుడు, టీమ్‌ఇండియా మాజీ సారథి విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. పదిహేనేండ్లుగా భారత క్రికెట్ ముఖచిత్రంగా ఉన్న కోహ్లీ.. తనకెంతో ఇష్టమైన ఐదురోజుల ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. మరికొద్దిరోజుల్లో ఇంగ్లండ్ వేదికగా ఆ జట్టుతో జరుగబోయే కీలకమైన ఐదు టెస్టుల సిరీస్‌కు ముందే వీడ్కోలు నిర్ణయాన్ని ప్రకటించి అందరినీ విస్మయానికి గురిచేశాడు. కొద్దిరోజుల క్రితమే టెస్టుల నుంచి తప్పుకొంటానని బీసీసీఐకి సమాచారమిచ్చిన విరాట్.. మంగళవారం తన సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో రిటైర్మెంట్ ప్రకటన చేశాడు. ఇటీవలే రెడ్‌బాల్ క్రికెట్‌కు మాజీ సారథి రోహిత్ శర్మ వీడ్కోలు పలకగా తాజాగా కోహ్లీ కూడా అతడినే అనుసరించడంతో ఇంగ్లండ్ సిరీస్‌లో భారత జట్టు ఈ ద్వయం లేకుండానే బరిలోకి దిగనుండటం గమనార్హం.

2011లో వెస్టిండీస్‌తో మ్యాచ్ ద్వారా తొలిసారిగా భారత టెస్టు జట్టులో అరంగేట్రం చేసిన విరాట్.. 14 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో శతాధిక (123) టెస్టులు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. ఈ క్రమంలో కోహ్లీ 30 శతకాలు, 31 అర్ధ శతకాలు సాధించాడు. కోహ్లీ ఖాతాలో ఏడు ద్విశతకాలుండగా అత్యధిక స్కోరు 254 నాటౌట్‌గా ఉంది. బ్యాటర్‌గానే గాక సారథిగానూ అతడు సూపర్ హిట్. నాయకుడిగా కోహ్లీ టీమిండియాను 68 టెస్టులలో నడిపించాడు. కోహ్లీ సారథ్యంలో భారత జట్టు 68 టెస్టులాడి ఏకంగా 40 విజయాలు సాధించింది. 2024-25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జనవరిలో ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా ఆడిన టెస్టే ఆఖరిది. గతేడాది టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత పొట్టి ఫార్మాట్ నుంచి తప్పుకొన్న కోహ్లీ.. తాజాగా టెస్టులకూ గుడ్‌బై చెప్పాడు. ఈ రెండు ఫార్మాట్ల నుంచి వైదొలిగినా కోహ్లీ.. ప్రపంచ క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ పేజీని కల్పించిన వన్డే ఫార్మాట్‌లో మాత్రం కొనసాగనున్నాడు.

రిటైర్మెంట్‌పై కోహ్లీ ప్రకటన సారాంశం..

'14 ఏండ్ల క్రితం తొలిసారి ఈ నీలి రంగు క్యాప్‌ను ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇక్కడిదాకా తీసుకెళ్తుందని నేను ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలను నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నాకు ఎంతో ప్రత్యేకమైంది. సుదీర్ఘమైన రోజులు, నిశ్శబ్ద ఆటతీరు ఎవరికీ కనిపించని చిన్న చిన్న క్షణాలు ఎల్లకాలం నాతోనే ఉంటాయి. అటువంటి ఈ ఫార్మాట్ నుంచి వైదొలగడం అంత తేలిక కాదు. కానీ నా నిర్ణయం సరైందే అనిపిస్తున్నది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. అదీ నాకు అంతకంటే ఎక్కువే తిరిగిచ్చింది. మనస్ఫూర్తిగా, పూర్తి కృతజ్ఞతా భావంతో ఈ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నా. క్రికెట్‌కు, నా తోటి ఆటగాళ్లకు, నా ప్రయాణాన్ని సుదీర్ఘకాలం కొనసాగించేలా తోడ్పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నా టెస్టు కెరీర్ సంతృప్తికరం. ఇక సెలవు' అంటూ భావోద్వేగ లేఖతో కోహ్లీ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు.

రాజ్యంలేని రారాజు

> టెస్టు క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. కానీ కోహ్లీ వారసత్వం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. టీమ్‌ఇండియాకు అతడు అందించిన సేవలు మరువలేనివి - బీసీసీఐ

భారత్ తరఫున టెస్టులలో అత్యధిక పరుగుల వీరులు

సచిన్	15,921
ద్రావిడ్	13, 265
గవాస్కర్	10,122
కోహ్లీ	9,230

మూడు ఫార్మాట్లలో కలిపి..

సచిన్	34,357
కోహ్లీ	27,599
ద్రావిడ్	24,064
రోహిత్	19,700



నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

2014లో టీమిండియా టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లింది. అటువైపు భయమెరుగని మహామహులు. ఇటుచూస్తే దశాబ్దాల పాటు టీమిండియాను కాచుకున్న సచిన్, లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ లాంటి యోధానుయోధులు ఇక చాలని పోరు చాలించారు. ధోని అందుబాటులో లేడు. 70 ఏండ్లుగా జరుగుతున్న పోరాటంలో సిరీస్ గెలుపు తలుపు తట్టని భారత్‌ను చూసి కంగారూలు విర్రవీగుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో భారత భారాన్ని తన భుజాలపై వేసుకున్న నూనుగు మీసాల కుర్రాడు విరాట్ కోహ్లీ కదనరంగంలోకి దూకాడు. ఒక పట్టాన ఓటమిని అంగీకరించని ఆసీస్‌కు ముచ్చెమటలు పట్టించాడు. మహాభారతంలో అభిమన్యుడిలాగానే పరాక్రమం చూపుతూ తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 115 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 141 పరుగులు చేసి, చివరి వరకు పోరాడి ఆస్ట్రేలియాకు ఓటమి భయాన్ని పరిచయం చేశాడు. మ్యాచ్ ఓడిపోయినా ఇండియాకు మాత్రం గెలుపును రుచి చూపించి తన కెప్టెన్సీ ప్రస్థానాన్ని ఘనంగా చాటిచెప్పాడు. తాము డ్రాల కోసం రాలేదని, చావోరేవో తేల్చుకునేందుకు వచ్చామని చెప్పి, సరికొత్త టీమిండియాను ప్రపంచానికి పరిచయం చేశాడు. మాటకు మాట, దెబ్బకు దెబ్బ అన్నట్టుగా జట్టును తయారు చేశాడు. మాటల్లోనే కాదు, చేతల్లోనూ చేసి చూపించాడు. అలా అతి తక్కువ కాలంలోనే టీమిండియాను మళ్లీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాడు.

'సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) కంట్రీస్' కంచుకోటలను బద్దలు కొట్టాడు. 70 ఏండ్లుగా ఆస్ట్రేలియాలో కొరకరాని కొయ్యగా మారిన సిరీస్ విజయాన్ని 2018లో సాధించి చూపెట్టాడు. ఐసీసీ తొలి టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్‌ను ఫైనల్‌కు చేర్చాడు. 2017 నుంచి 2021 వరకు భారత్ టెస్టు గదను ముద్దాడేలా చేశాడు. తన టెస్ట్ కెరీర్లో మొత్తం 68 మ్యాచ్‌లకు కెప్టెన్సీ చేసిన విరాట్.. 40 మ్యాచులు గెలిపించి, సాటిలేని మేటి కెప్టెన్‌గా ఎదిగాడు. టెస్టులనూ టీవీలకు అతుక్కొని చూసేలా చేశాడు.

బాధ్యతలు పెరిగితే చాలామంది ఒత్తిడికి చిత్తవుతారు. కెప్టెన్సీ భారాన్ని మోయలేక చతికిలపడతారు. కానీ, విరాట్ కోహ్లీ అందుకు అతీతుడు. నిప్పుల కొలిమిలో కాలినప్పుడే బంగారం మెరిసినట్టు ఒత్తిడిలోనే విరాట్ బెస్ట్ బయటికి వస్తుంది. ప్లేయర్‌గా 55 టెస్టు మ్యాచులు ఆడిన విరాట్.. 37.40 సగటుతో 3,366 పరుగులు చేశాడు. టీమిండియా సారథిగా 68 టెస్టులాడి.. 54.80 సగటుతో 5,864 పరుగులు చేశాడు. మొత్తంగా 123 మ్యాచ్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. మొత్తం 30 సెంచరీలు, 61 అర్ధ శతకాలు చేశాడు. టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా 2018, 2019లో, క్రికెట్ ఆఫ్ ది ఇయర్‌గా 2017, 2018లో నిలిచాడు.

విరాట్ ఒక అసాధ్యుడు. భారతంలో భీముడిలా అగ్రెసివ్‌గా ఆడగలడు. అర్జునుడిలా సంగ్రామాన్ని ఒక్కడే నడిపించగలడు. ధర్మరాజులా లౌక్యంతోనూ, నకులసహదేవుల్లా యాంకర్ పాత్రనూ పోషించగలడు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అతనొక పంచ పాండవుల మేలు కలయిక.. రాజ్యం లేని రారాజు. 2011లో వన్డే వరల్డ్ కప్ గెలిచాక టీమిండియా భారాన్ని విరాట్‌పై మోపి సచిన్ నిష్క్రమించిన నాటి నుంచీ.. టీమ్ భారాన్ని మోస్తున్న యోధుడు. ఇప్పుడు తనపైనున్న భారాన్ని ఒక్కొక్కటిగా దించుకుంటూ మనల్ని బాధలో ముంచెత్తుతున్నాడు. యోధుడా.. మా నాయకా.. నీకు సలాం..

టెస్టులలో కోహ్లీ

	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్	పరుగులు	సగటు	శతకాలు
మొత్తం	123	210	9,230	46.85	30
స్వదేశంలో	55	87	4,336	55.58	14
విదేశాల్లో	68	123	4,894	41.12	16
సారథిగా	68	113	5,864	54.80	20
ఆటగాడిగా	55	97	3,366	37.40	10

సింహం లాంటి దూకుడుతనం అతని సొంతం. చీర్స్ మేము నిన్ను మిస్సవుతున్నాం.
- గౌతం గంభీర్

టెస్టు కెరీర్‌కు నువ్వు వీడ్కోలు పలుకడాన్ని నమ్మలేకపోతున్నాను. ప్రస్తుత యుగానికి దిగ్గజ క్రికెటర్‌వు, టెస్టు మ్యాచ్ క్రికెట్‌కు అద్భుతమైన బ్రాండ్ అంబాసిడర్. నీ ఆటతో లెక్కలేనన్ని జ్ఞాపకాలను అందించావు అందరికీ. నాకు మరీ ప్రత్యేకంగా, అది జీవితాంతం గుర్తుంచుకుంటాను. గో వెల్ చాంప్. గాడ్ బ్లెస్ యూ.
- రవిశాస్త్రి,మాజీ చీఫ్ కోచ్

దేశ వ్యాప్తంగా కోట్లాది మందికి నీ ఆటతీరుతో ఆదర్శంగా నిలిచావు. నీదో అద్భుతమైన టెస్టు కెరీర్. కేవలం పరుగులు సాధించడం ద్వారానే కాకుండా క్రికెట్ పట్ల అమితాసక్తి ఉన్న అభిమానులు, క్రికెటర్లతో కూడిన కొత్త జనరేషన్‌కు మూలంగా నిలిచావు. నీ ప్రత్యేకమైన టెస్టు కెరీర్‌కు వీడ్కోలు సందర్భంగా అభినందనలు. - సచిన్ టెండూల్కర్

విరాట్ కోహ్లీ అద్భుతమైన టెస్టు క్రికెట్ ప్రయాణం ముగిసింది. నీ నిబద్ధత, నాయకత్వ శైలితో భారత క్రికెట్‌కు కొత్త నిర్వచనాన్ని అందించావు. టెస్టుల్లో మరిచిపోలేని జ్ఞాపకాలు అందించినందుకు కృతజ్ఞతలు. వన్డేల్లో మీ విజయయాత్ర కొనసాగాలని ఆశిస్తున్నాను.
- హరీశ్‌రావు, మాజీ మంత్రి

రోకో లేని టీమ్‌ఇండియా

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

2012లో భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ అంతర్జాతీయ స్థాయిలో వందో శతకం సాధించిన సందర్భంగా క్రికెటర్లు, బాలీవుడ్ సెలబ్రిటీలతో కలిసి ముంబైలో ఓ పార్టీ జరిగింది. ఆ పార్టీకి యాంకర్‌గా వ్యవహరించిన సల్మాన్ ఖాన్.. మాస్టర్ బ్లాస్టర్‌తో 'సచిన్.. సమీప భవిష్యత్‌లో మీ రికార్డులను ఎవరైనా అధిగమించగలరా?' అని ప్రశ్నించాడు. దానికి సచిన్ స్పందిస్తూ.. 'ఇక్కడే ఈ గదిలోనే కొంతమంది కుర్రాళ్లు నా రికార్డులను బ్రేక్ చేయాలని ఆశిస్తున్నా. విరాట్, రోహిత్‌కు ఆ సత్తా ఉంది' అని అన్నాడు. అప్పటికీ రోహిత్, కోహ్లీ (రోకో) భారత జట్టులో పూర్తిస్థాయిలో కూడా కుదురుకోలేదు. సచిన్ చెప్పినట్టుగా రోకో ద్వయం లిటిల్ మాస్టర్ నెలకొల్పిన అన్ని రికార్డులనూ బ్రేక్ చేయనప్పటికీ గడిచిన పదిహేనేండ్ల కాలంలో ఈ ఇద్దరూ లేని భారత క్రికెట్‌ను ఊహించడం కష్టం. టీమ్‌ఇండియాలోకి వీరి ఆగమనం కూడా దాదాపు నెలల వ్యవధిలోనే జరిగింది. దశాబ్దంన్నరగా భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన రోకో.. టీ20లతో పాటు టెస్టుల నుంచి ఏకకాలంలో తప్పుకోవడం సగటు భారత క్రికెట్ అభిమాని జీర్ణించుకోలేనిదనడంలో ఏమాత్రం సందేహం లేదు. వన్డేలు, టీ20లు, టెస్టులు.. ఫార్మాట్ ఏదైనా భారత క్రికెట్‌పై వీళ్లు వేసిన ముద్ర సాధారణమైంది కాదు. ఈ ఇద్దరూ ధోని సారథ్యంలోనే భారత జట్టుకు అరంగేట్రం చేసినా ఒకరి నాయకత్వంలో మరొకరు ఆడారు. ఒకరంటే ఒకరికి ఎంతో గౌరవం. అలాంటిది ఈ ఇద్దరూ లేకుండా టీమ్‌ఇండియా కొత్త ప్రయాణం మొదలుపెట్టనున్నది. టెస్టులు, టీ20ల నుంచి తప్పుకొన్న ఈ దిగ్గజాలు ఇకనుంచి వన్డేలలో మాత్రమే బ్లూజెర్సీలలో కనిపిస్తారు. ఈ జోడీ 2027 వన్డే ప్రపంచ కప్ వరకూ ఆడతారని ఆశిస్తున్నా.. దానిపై స్పష్టత లేదు. ఆలోపు భారత్ ఆడే వన్డేలు 27 మాత్రమే అన్నది చేదు నిజం!

ముగిసిన భారత్ పోరు

చికాగో: వరల్డ్ స్క్వాష్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ పోరాటం రెండో రౌండ్‌కే ముగిసింది. సింగిల్స్ విభాగాల్లో నలుగురు ప్లేయర్లు బరిలోకి దిగినా ఒక్కరు కూడా ముందంజ వేయలేకపోయారు. మహిళల సింగిల్స్‌లో అన్హత్ సింగ్‌తో పాటు పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్, వీర్ ఛత్రోని, రమిత్ టాండన్ ఓటములపాలై ఇంటిబాట పట్టారు.

17న ఐపీఎల్ పునఃప్రారంభం

- ఆరు వేదికల్లో 17 మ్యాచ్‌లు
- హైదరాబాద్‌కు దక్కని అవకాశం

ముంబై: క్రికెట్ అభిమానులకు శుభవార్త! భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో అర్ధాంతరంగా ముగిసిన ఐపీఎల్ పునః ప్రారంభానికి వేళయైంది. ఇరు దేశాల మధ్య పరిస్థితులు ఒకింత సద్దుమణిగిన వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సోమవారం అత్యవసరంగా సమావేశమై ఐపీఎల్ తదుపరి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. కేంద్ర ప్రభుత్వం, సెక్యూరిటీ ఏజెన్సీలు, ఫ్రాంచైజీలతో కలిసి సుదీర్ఘంగా చర్చించిన బీసీసీఐ లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. మిగిలిన 17 మ్యాచ్‌ల కోసం దేశంలో ఆరు వేదికలను ఖరారు చేసింది. ఇందులో బెంగళూరు, ముంబై, లక్నో, జైపూర్, ఢిల్లీ, అహ్మదాబాద్ ఉన్నాయి. ఈనెల 17వ తేదీన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మధ్య బెంగళూరులో జరిగే మ్యాచ్‌తో ఐపీఎల్ సందడి మళ్లీ మొదలు కానుంది. ఈ క్రమంలో రెండు ఆదివారాలు లీగ్‌లో డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆరు వేదికల్లో హైదరాబాద్‌కు చోటు దక్కలేదు. లీగ్ షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ..మే 29 నుంచి క్వాలిఫయర్-1తో మొదలయ్యే ప్లేఆఫ్స్ వేదికలను మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. మే 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్-2, జూన్ 3న ఫైనల్ జరుగనున్నాయి. రానున్న అంతర్జాతీయ సిరీస్‌ల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ఐపీఎల్ పూర్తి చేసేందుకు తొందరపడుతున్నట్లు తెలుస్తున్నది. జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్‌ఇండియా..ఇంగ్లండ్‌కు బయల్దేరాల్సి ఉంది. ఇదిలా ఉంటే భారత్, పాక్ పరిస్థితులు అదుపులోకి వచ్చిన వేళ లీగ్‌లో విదేశీ ప్లేయర్ల ప్రాతినిధ్యంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే పలువురు ప్లేయర్ల తమ దేశాలకు పయనమైన సంగతి తెలిసిందే.

తెలంగాణకు 4 స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ జూనియర్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్స్ నాలుగు స్వర్ణ పతకాలు సహా మొత్తం ఆరు పతకాలతో సత్తా చాటారు. ముంబైలోని మార్వేలో జరిగిన ఈ టోర్నీలో హైదరాబాద్ రసూల్‌పురాలోని ఉద్భవ్ స్కూల్‌కు చెందిన లాహిరి .. అండర్-16 సబ్ జూనియర్ విభాగంలో పసిడి గెలిచింది. అదే పాఠశాలకు చెందిన తనూజ, శ్రవణ్ జూనియర్ డబుల్ హ్యాండర్ విభాగాల్లో విజయాలు సాధించారు. అండర్ -15 విభాగంలో బొంగూర్ బన్నీకి పసిడి, రిజ్వాన్ మహ్మద్ రజతం, రవికుమార్ కాంస్యం గెలిచారు.

20 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

- గుజరాత్‌లో రెక్కీ నిర్వహించి పట్టుకున్న సీఎస్‌బీ
- దేశవ్యాప్తంగా 515 కేసుల్లో నిందితుల ప్రమేయం
- 27 మ్యూల్ ఖాతాలతో రూ.4.37 కోట్ల మళ్లింపు
- తెలంగాణలో రూ.22,64,500 విత్‌డ్రా: శిఖాగోయెల్

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): గుజరాత్ నుంచి తెలంగాణ సహా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న 20 మందిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. గుజరాత్‌లో ఈ నెల 1 నుంచి 10 వరకు రెండు బృందాలు రెక్కీ నిర్వహించి వారిని అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ సోమవారం ప్రకటించారు. నిందితుల్లో ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులతోపాటు ఓ బ్యాంకు ఉద్యోగి సహా మొత్తం 14 మంది మ్యూల్ ఖాతాదారులు, ఆరుగురు ఏజెంట్లు ఉన్నారని, వారి నుంచి 20 మొబైల్ ఫోన్లు, 28 సిమ్ కార్డులు, 4 ఏటీఎం కార్డులు, 5 చెక్ బుక్స్, 2 పాన్‌కార్డులు, 2 రబ్బర్ స్టాంపులు, పలు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. తెలంగాణలోని 60 కేసుల్లో, దేశవ్యాప్తంగా 515 కేసుల్లో ప్రమేయం ఉన్న ఈ నిందితులు.. 27 మ్యూల్ ఖాతాలతో రూ.4.37 కోట్లు మళ్లించారని, చెక్కుల ద్వారా ఒక్క తెలంగాణలోనే రూ.22,64,500 విత్‌డ్రా చేశారని వివరించారు. వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులకు తెలియజేయవద్దని, ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌ను లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని శిఖా గోయెల్ సూచించారు.

కర్రెగుట్టల్లో మళ్లీ ఆపరేషన్ కగార్

ములుగు, మే 12 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల వరకు విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో మళ్లీ ఆపరేషన్ కగార్ ప్రారంభమైంది. ఇండియా-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో కర్రెగుట్టల్లో కూంబింగ్ చేస్తున్న కేంద్ర బలగాలను కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం వెనక్కి రప్పించిన విషయం తెలిసిందే. యుద్ధ విరమణ ప్రకటన వెలువడగా సోమవారం నుంచి కేంద్ర బలగాలు తిరిగి కర్రెగుట్టల్లో కూంబింగ్ చేస్తున్నట్టు తెలిసింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజల్లో అలజడి మొదలైంది.

- కేసీఆర్ కట్టిచ్చిన బుద్ధవనంలో అందాల భామలు

మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే ఆసియా ఓసియన్ గ్రూప్ -4 లోని 22 దేశాల అందాల భామలు బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం బుద్ధవనాన్ని సందర్శించారు. హైదరాబాద్ నుంచి బస్సులో నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్‌కు చేరుకున్నారు. వారికి నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికారులు స్వాగతం పలికారు. విజయవిహార్ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకొని ఫొటో షూట్ అనంతరం సాయంత్రం 6.15గంటలకు బుద్ధవనం చేరుకున్నారు. బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించి, మహా స్థూపం ఎదుట ఫొటోలు దిగారు. మహా స్థూపంలోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన బుద్ధవనం విశేషాలను వారికి పురావస్తు నిపుణులు ఈమని శివనాగిరెడ్డి వివరించారు. జాతక పార్కులో బుద్ధ చరితంపై కళాకారులు ప్రదర్శించిన నృత్యాలను తిలకించి రాత్రి 8.20 గంటలకు హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఇక్కడ ఐజీ సత్యనారాయణ, ప్రత్యేకాధికారి లక్ష్మి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు. - నందికొండ

ఇట్లయితే పనులెట్ల చేసుడు?

- పనులు 18 వేల కోట్లు.. పేమెంట్లు 2 వేల కోట్లా?
- ఇట్లనే ఉంటే పేమెంట్లకు ఆరేడేండ్లు పడుతది : బిల్డర్స్ అసోసియేషన్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఏఐ బహిరంగ లేఖ

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : రోడ్లు భవనాల శాఖలో సుమారు రూ.18 వేల కోట్ల విలువయ్యే పనులు వివిధ దశల్లో కొనసాగుతుండగా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే చెల్లించిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆవేదన వ్యక్తంచేసింది. పంచాయతీరాజ్ శాఖలో కూడా రూ.10 వేల కోట్ల పనులు జరుగుతుంటే ఇప్పటివరకు కేవలం రూ. 1200 కోట్లు మాత్రమే చెల్లించినట్టు తెలిపింది. పరిస్థితి ఇలాగే ఉంటే జరుగుతున్న పనులకు పేమెంట్లు వచ్చేందుకు ఆరేడేండ్లు పడుతుందని వాపోయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసింది. 'ఉద్యోగులను ఉద్దేశించి మీరు చేసిన ఉపన్యాసంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయాలను మీడియాలో చూశాం. వివిధ శాఖల్లో ఆర్థిక అంచనాలకు మించి పనులు చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మీరు ఎలా అయితే ఆవేదన చెందుతున్నారో.. ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేస్తున్నామంటే మాకు కూడా అప్పులు పుట్టక అదేవిధంగా ఆందోళన చెందుతున్నాం. అయినా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పనులు పూర్తిచేయాలని మాపై ఒత్తిడి తెస్తున్నారు. వారి ఒత్తిడితో మేము గుండెలు ఆగిపోయే దుస్థితికి వచ్చినం. బిల్లులు రాక ఆందోళన చెంది ఇటీవల ఆదిలాబాద్‌కు చెందిన ప్రవీణ్ అనే యువ కాంట్రాక్టర్ గుండె ఆగిపోయి చనిపోవడమే ఇందుకు నిదర్శనం. మేము రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూశాక ఎన్నోసార్లు ప్రభుత్వానికి సూచన చేద్దామనుకున్నా మా సూచన వినేవారు లేరు. అందుకే ఈ లేఖ ద్వారా మా బాధలు మీ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నం. వివిధ శాఖల వారీగా జరిగే పనుల మీద ఒకసారి సమీక్ష పెట్టి, ప్రభుత్వం ఏ సంవత్సరం ఎంత పేమెంట్ ఏ ఏ శాఖలకు ఇవ్వగలుగుతుందో, ఏ ఏ పనులు చేపట్టాలో నిర్ణయిస్తే సమస్యకు కొంతైనా పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నాం. ఇప్పుడున్న బకాయిలను ఎన్ని రోజుల్లో చెల్లిస్తరు? సమాన నిష్పత్తిలో చెల్లింపులు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుంది. మేము సుమారు మూడు లక్షల మందికి ప్రత్యక్షంగా, 10 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం. మమ్ములను రక్షించుకోవాల్సిన బాధ్యత మీ మీద ఉన్నది. ఇది తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న గవర్నమెంట్ కాంట్రాక్టర్ల గుండె చప్పుడు' అని సీఎంకు రాసిన లేఖలో బీఏఐ వివరించింది.